క్లుప్తంగా

దర్శి కేవీకేకు ఉత్తమ అవార్డు

దర్శి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, గుంటూరు పర్యవేక్షణలో 2021–22లో దర్శి కృషి విజ్ఞాన కేంద్రానికి కృషి విజ్ఞాన కేంద్రం అవార్డు లభించింది. బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన 52వ పరిశోధనా, విస్తరణ సలహామండలి సమావేశంలో ఉపకులపతి ఏ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెటింగ్ గవర్నమెంట్ అడ్వైజర్ బి. బ్రహ్మానంద రెడ్డి, వ్యవసాయ గవర్నమెంట్ అడ్వయిజర్ బి. తిరుపాల్‌రెడ్డి చేతుల మీదుగా కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ అవార్డును స్వీకరించినట్లు శనివారం తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ తూము వెంకటేశ్వరరెడ్డి , డాక్టర్ ఎం ఉష, డాక్టర్ ఎం. శివ అభినందనలు తెలిపారు.

ఎస్‌ఏ-1 పరీక్షల తీరుపై తనిఖీ

పుల్లలచెరువు: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ అన్నారు. మండలంలోని చాపలమడుగు పాఠశాలలో జరుగుతున్న ఎస్‌ఏ–1 పరీక్షల నిర్వహణ తీరును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు గతంలో శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు తెలియచేయాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పనుల నాణ్యత లోపం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

సమయపాలన పాటించాలి

తర్లుపాడు: సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీడీవో సాయికుమార్ సూచించారు. సీతనాగులవరం సచివాలయంను శనివారం తనిఖీ చేశారు. డీడీఓ మాట్లాడుతూ మూడుపూటల బయోమెట్రిక్ వేయాలని సూచించారు. అర్జీదారులు స్పందనలో భాగంగా కలెక్టరేట్‌కు వెళ్ళకుండా ఇక్కడే పరిష్కరించాలన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి

మార్కాపురం: ఆర్టీసీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎస్‌ఎంయూ సెక్రెటరీ కాశయ్య తెలిపారు. శనివారం డిపో ఆవరణలో సీసీఎస్ డైరీ ఆవిష్కరించారు. ప్రయాణికులకు తమ వంతు సేవలు అందిస్తామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎంయూ కృషి చేస్తుందన్నారు. సీసీఎస్ సభ్యత్వం వలన ఉద్యోగులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మూర్తయ్య, వలి పాల్గొన్నారు.

వైద్యశాల తనిఖీ

కంభం: రోగులకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్య విధానపరిషత్ కో ఆర్డినేటర్ డా.యస్.యస్ మూర్తి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వైద్యశాలలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. సూపరింటెండెంట్ డా. శివనాయక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షులు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: స్థానిక పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సహస్ర నామార్చన, తిరుప్పావై ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ధనుర్మాసం చివరిరోజు భోగి పండుగ రోజున గోదాదేవి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామానికి చెందిన షేక్.నాయకునిగారి మౌలాలి 5వ తేదీన ఆనారోగ్యంలో మృతి చెందాడు. ఆయన నామినీ అయిన ఆతని భార్య షేక్.నాయకుని గారి ఖాదర్ బీకి మట్టి ఖర్చుల నిమిత్తం కోసం వైఎస్సార్ బీమా నగదును రూ.10 వేలను గ్రామ సర్పంచ్ షేక్.పల్నాటి లతీఫ్ చేతులు మీదుగా శనివారం పంపిణీ చేశారు. అనుమలవీడు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, మహిళా పోలీష్ రీటకుమారి, గ్రామ వలంటీర్ షేక్.పల్నాటి అబ్దుల్ అలి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి సన్మానం

దర్శి: జాతీయ స్థాయిలో ఉత్తమ గోపాలరత్న అవార్డు అందుకున్న బొట్లపాలెం పశువైద్యాధికారి డాక్టర్ బసవయ్యను మార్కెట్ యార్డ్ చైర్మన్ వైపీ సుబ్బయ్య శనివారం ఘనంగా సత్కరించారు. బొట్లపాలెం పశువైద్యశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుబ్బయ్య మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేసి అవార్డు అందుకున్న బసవయ్య.. పశువులకు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయా మండలాలకు చెందిన పశువైద్యాధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రాంబాబు, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



కొమరోలు: నగదును పంపిణీ చేస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు



కంభంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

కొమరోలు: రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అందజేస్తోందని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు అన్నా వెంకట రాంబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం కొత్తగా మంజూరైన వైఎస్ఆర్ పింఛన్ కానుకను పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోనివి కల్పిత కథలు అల్లి బురద జల్లే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ఎంపీపీ కామూరి అమూల్య, జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, వైస్ ఎంపీపీలు నాగమ్మ, మౌళాలి, ఎంపీటీసీలు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తిరుమలరాజు, సుభాని, గ్రామసర్పంచ్‌లు హటీల్‌పీరా, కాశమ్మ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ పాలన

కంభం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నావెంకటరాంబాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం 143 కొత్త పింఛన్లు మంజూరు కాగా అందించారు. డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ నర్సయ్య, తహసీల్దార్ రవి, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, యేలం వెంకటేశ్వర్లు, సర్పంచులు పల్నాటిబోడయ్య, బత్తులతిరుపాలమ్మ (రజని), మహబూబ్‌పీరా, రసూల్, బాష, ఎంపీటీసీలు ఆనంద్, రఫి, నాగరాజు, రామ్మూర్తి, హసీనా, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, ఉపసర్పంచ్ సయ్యద్ ఖాసిం, సయ్యద్‌జాకీర్ హుస్సేన్, చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, సబ్బసానిసాంబశివారెడ్డి పాల్గొన్నారు.

పెంచిన పెన్షన్ అందజేత

కొనకనమిట్ల: ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న పింఛన్ రూ.2750కు పెంచారని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు పురస్కరించుకొని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. 233 మందికి పెంచిన నగదును అందజేశారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫా, సొసైటీ చైర్మన్‌లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తాతిరెడ్డి చినవెంకటరెడి, ఆదర్శ రైతు ఉడుముల గురవారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, కార్యదర్శుల సంఘం అధ్యక్షురాలు రాజకుమారి పాల్గొన్నారు.



కొనకనమిట్లలో పెన్షన్ అందజేస్తున్న ఉడుముల

పింఛన్లతో ఆర్థిక భరోసా

పెద్దారవీడు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్లతో ఆర్థిక భరోసా కలుగుతోందని మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు గుడ్డైపోగు రమేష్ పేర్కొన్నారు. మండలంలోని సుంకేసుల గ్రామ సచివాలయంలో శనివారం 14 మందికి నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పార్టీలకు సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కొర్ర శ్రీనునాయక్, వైస్ సర్పంచ్ కోటకొండ నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆవుల నాగిరెడ్డి, గుర్రం ముత్యాలయ్య, వెంకట సుబ్బయ్య, వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



వృద్ధులకు పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ గుడ్డైపోగు రమేష్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

పెద్దారవీడు: అందరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించే దిశగా హనుమాన్ జంక్షన్ కుంట ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కృషి చేస్తుందని బ్యాంక్ మేనేజర్ ఎస్కే కరీమా పేర్కొన్నారు. మండలంలోని సోమేపల్లి గ్రామంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా అందుతున్న సేవలు, ఏటీఎం వినియోగంతో పాటు ఆన్‌లైన్ విధానం ద్వారా నగదు లావాదేవీల నిర్వహణ, నెఫ్ట్, డబ్బు ఆదా చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఆర్థికపరమైన మార్పులతో వస్తున్న డిజిటల్ విధానాన్ని వినియోగించే క్రమంలో చోటు చేసుకుంటున్న సైబర్ మోసాలపై చాలా జాగ్రత్తగా ఉండాలని వివరించారు. బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించిన వారికే ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి, అటల్ పింఛన్ యోజన వంటి పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్ అనిల్‌కుమార్, క్యాషియర్ కోటిబాబు, సిబ్బంది హరినారాయణ, హర్షవర్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ ఎస్‌కే కరీమా

కంది సాగుపై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి: కంది సాగు చేసిన రైతులు కాయ దశలో అప్రమత్తంగా ఉండి, యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం జరిగింది. క్షేత్ర స్థాయిలో పైరును పరిశీలించిన అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. రక్షణ పంటగా నాలుగు చాళ్ళు జొన్న సాగు చేయాలన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

అర్ధవీడు (కంభం): స్థానిక ప్రభుత్వ నియర్ కళాశాలలో శనివారం ఆరవీటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరామ్ కంటి వైద్యుల బృందంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివలక్ష్మమ్మ, మురళీ క్రిష్ణ, జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు

త్రిపురాంతకం: రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన సమయంలో, జీవో నంబర్ 1 ఉల్లంఘన అంటూ పెద్దపెద్ద అక్షరాలతో పచ్చ మీడియా రోతరాతలు రాస్తూ అబద్ధపు ప్రచారం చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య యాదవ్, పార్టీ నాయకులు ఎస్.పోలిరెడ్డి, దగ్గుల గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ నిబంధనలు ఉల్లంఘించారని పచ్చ పత్రికల్లో విమర్శలు రాయడంపై వారు మండిపడ్డారు. నేషనల్ హైవే పై నుంచి ర్యాలీ చేసినట్లు అసత్య వార్తలు రాశారన్నారు. హైవే వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయ కొట్టేందుకు దిగారని, అక్కడ నుంచి గ్రామంలోకి వెళ్లే ఇరుకు రోడ్డులో ధాన్యం కొనుగోలు కేంద్రం వరకు నడుచుకుంటూ వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారన్నారు. ఈ విషయాలను తప్పుడు ప్రచారం చేస్తూ హైవేపై ర్యాలీలు చేసినట్లు ప్రచారం చేశారన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేయడం, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ నాయకులు

ఉద్యాన పంటలకు ఆర్థిక ప్రోత్సాహం

పెద్దారవీడు: ఉద్యానవన పంటలు సాగు చేసిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహిస్తోందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్ అన్నారు. మండలంలోని తోకపల్లె సచివాలయం పరిధిలో నర్సరీలు, మిరప, కూరగాయల పంటలను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు ఆదాయ మార్గాన్ని సమకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కూరగాయల పంటలు సాగు చేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, అందుకే కూరగాయల పంటలపై వారు ఆసక్తి చూపుతున్నారన్నారు. రాయితీ కోసం దరఖాస్తు పెట్టుకున్న రైతుల బ్యాంక్ ఖాతాలో నగదు త్వరలోనే జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి ఆదిరెడ్డి, వీఏఏ ప్రేమ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

గిద్దలూరు రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట మండలాలకు చెందిన రైతుభరోసా కేంద్రం సిబ్బందికి శనివారం ఆధునిక వ్యవసాయ వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శనగ, కంది పంటల్లో ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్య రక్షణ పద్ధతుల గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం దర్శి శాస్త్ర వేత్త టి.వెంకటేశ్వర రెడ్డి, గిద్దలూరు సహాయ వ్యవసాయ స ంచాలకులు బాలాజీనాయక్, ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, రైతు భరోసాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపిచంద్

మరిన్ని కేసులు రాజీ చేయాలి

దర్శి: ఫిబ్రవరి 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో మరిన్ని కేసులు రాజీ చేసే దిశగా పోలీస్ అధికారులు, న్యాయవాదులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి జీఎల్‌వీ ప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి సూచించారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పోలీస్ అధికారులతో జడ్జిలు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసాద్, సరస్వతి మాట్లాడుతూ కక్షిదారులతో మాట్లాడి వారి సమస్యలపై చర్చించి రాజీ చేసుకునేలా చూడాలన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా రాజీమార్గంలో మరింత న్యాయం చేసే దిశగా పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రూ.6 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని శివరాజనగర్‌లో రూ.6 లక్షల వ్యయంతో 63 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సరిపోవడం లేదని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు గ్రామస్తులు తెలిపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ మేరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఏఈ ప్రసాద్ తెలిపారు. దీంతో శివరాజనగర్‌లో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

దొనకొండ: ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని ప్రజలకు చేరవేయాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం వారికి సమీక్ష సమావేశం నిర్వహించారు. కొచ్చెర్లకోట, రుద్రసముద్రం, ఇండ్లచెరువు, వద్దిపాడు, ఆరవల్లిపాడు, పెదన్నపాలెం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులంతా సమయపాలన పాటించి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రజలు సచివాలయానికి వచ్చినప్పుడు వారితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వలంటీర్లు వారధిలాంటి వారని ఆమె అన్నారు. ఎవరిపైనైనా ఆరోపణలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి పనులు చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి, ఎంపీడీవో వి.వసంతరావునాయక్, ఈవోఆర్డీ ఎస్.డేవిడ్, వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఉషామురళి

నంద్యాలకు నూతన సర్వీసులు ప్రారంభం

మార్కాపురం: మండల కేంద్రం మార్కాపురం నుంచి నంద్యాలకు నూతనంగా మంజూరైన రెండు అల్ట్రా పల్లె వెలుగు బస్సులను శనివారం ఉదయం బస్టాండ్‌లో డీఎస్పీ డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్, డీఎం ఎ.ఎస్. నరసింహులుతో కలిసి ప్రారంభించారు. నంద్యాలకు అదనపు సర్వీసులను ఏర్పాటు చేయటం అభినందనీయమని డీఎస్పీ అన్నారు. డీఎం నరసింహులు మాట్లాడుతూ పది రోజుల క్రితం ఎమ్మెల్యే ద్వారా రెండు సర్వీసులు ప్రారంభించామని, మళ్లీ మరో రెండు సర్వీసులను శనివారం నుంచి నంద్యాలకు నడుపుతున్నామని ప్రయాణికులు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని సూచించారు. ఉదయం 5.. 5.30.. 6, 9 గంటలకు ఈ సర్వీసులు మార్కాపురం నుంచి నంద్యాలకు బయలు దేరుతాయన్నారు.

సంక్రాంతికి స్పెషల్ బస్సులు

సంక్రాంతి సందర్భంగా శనివారం నుంచి మార్కాపురం డిపో ద్వారా హైదరాబాద్‌కు 8 స్పెషల్ సర్వీసులు తిప్పుతున్నామని, రెగ్యులర్ చార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామని, రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామని, అదనపు చార్జీలు వసూలు చేయటం లేదన్నారు. అవసరమైతే బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. ఏడీఎం కామేశ్వరి, యూనియన్ నాయకులు జనార్దన్, కాశయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.



బస్సులను ప్రారంభిస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

తాళ్లూరు: నేల ఆరోగ్యంగా ఉంటేనే పంట ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా ఆత్మ పీడీ, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త కె.అన్నపూర్ణ అన్నారు. రైతులు పంటల సాగుకు ఉపయోగించాల్సిన ఎరువుల మోతాదుపై తాళ్లూరు ఆర్‌బీకేలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అన్నపూర్ణ మాట్లాడుతూ రైతులు అవసరమైన మేరకే ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచించారు. అధికంగా వాడితే దిగుబడులు సైతం తగ్గుతాయని చెప్పారు. పెట్టుబడి పెరిగి దిగుబడులు తగ్గితే రైతులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. సేంద్రియ, జీవన, పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని పెంచి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అద్దంకి ఏడీఏ కె.ధనరాజ్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ పాల్గొని శనగ, పత్తి, మిరప, పసుపు, మొక్కజొన్న పంటల సాగు యాజమాన్యం, పంటల ఈ–క్రాప్ నమోదు, పంట నష్టపరిహారం అందించడంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా పంటలను పరిశీలించారు.



తాళ్లూరులో రైతులకు శిక్షణ ఇస్తున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ